సాక్షి
చిత్తూరు

గురువారం । 20 । మార్చి । 2025



ఇసుమంతైనా భయంలేదు!

కౌండిన్యనదిలో ఇసుక దందాను అడ్డుకున్న అధికారులపైనే స్మగ్లర్లు దౌర్జన్యానికి దిగి, బెదిరించారు.

- 8లో



అడిగేదెవరు..ఆపేదెవరు?

అధికారం మాదే.. అడిగేదెవరు.. మమ్మల్ని ఆపేదెవరంటూ పచ్చనేతలు దుకాణాల వేలం పాటలో రెచ్చిపోయారు.

- 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
చిత్తూరు	6-29	4-56
పుంగనూరు	6-31	5-00

న్యూస్‌రీల్

కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి

ఐరాల: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. బుధవారం మండలంలోని అగరంపల్లె జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో మార్చి 17 నుంచి ప్రారంభమైన పరీక్షల నిర్వహణ ఏప్రిల్ 1వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 118 కేంద్రాల్లో సుమారు 21 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీటి వసతితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచుకోవడమే కాకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 భారత న్యాయ సంహిత నియమాలు వర్తిస్తాయని సూచించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందుగానే చేరుకోవాలన్నారు. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయడంతో మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎంఈఓ రుషేంద్రబాబు, అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే వేటు ఖాయం

– నలుగురు ఇన్విజిలేటర్ల తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్ : పదోతరగతి పబ్లిక్ పరీక్షల విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చీఫ్, డిపార్ట్‌మెంట్, ఇన్విజిలేటర్లపై వేటు ఖాయమని జిల్లా విద్యాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు పాఠ్యాంశాలకు సంబంధించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యాయి. ఈ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ఫ్లయింగ్‌స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. విద్యార్థుల పరంగా ఎలాంటి డిబార్ జరగకపోగా, విధి నిర్వహణలో అలసత్వం వహించిన నలుగురు ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించారు. పూతలపట్టులో ఇద్దరు, నగరిలో ఒకరు, జీడీనెల్లూరు నెల్లేపల్లి పరీక్ష కేంద్రంలో ఒక ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తప్పించారు. పది పరీక్షల అబ్జర్వర్ జ్యోతికుమారి బుధవారం జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి ఐరాల మండలం కాణిపాకం జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని, డీఆర్వో మోహన్‌కుమార్ కొంగారెడ్డిపల్లిలోని గాండ్లపల్లి నగరపాలక ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి పరీక్షల తీరును పర్యవేక్షించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 13 మంది 55 పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్‌ల సభ్యులు 41 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. హిందీ పరీక్షకు 20,609 మంది విద్యార్థులకు గాను 20,198 మంది హాజరుకాగా 411 మంది గైర్హాజరైనట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు.

ఉపాధి పచ్చపాది



కార్వేటినగరం మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి హామీ పేదలకు వరం. వలసల నివారణే దీని లక్ష్యం.. అయితే ఆ ఆశయానికి కూటమి సర్కారు తూట్లు పొడుస్తోంది. ఉపాధి కూలీల కడుపుకొట్టడానికి శ్రమశక్తి సంఘాల పేరుతో పచ్చనేతలు పక్కా ప్రణాళికలు రచించారు. మేట్ల నియామకంలో సీనియారిటీకి తిలోదకాలిచ్చి కూటమి నేతల సిఫార్సులకు పెద్దపీట వేశారు. ఫలితంగా పచ్చనేతలకు సిరులు.. కూలీలకు ఇక కష్టాలు మిగలనున్నాయి.

- దోపిడీకి పక్కా ప్రణాళికలు
- శ్రమశక్తి సంఘాల ముసుగులో దోచుకునేలా కుట్రలు
- ఉపాధి మేట్లుగా 95 శాతం అనుయాయులే
- వారి చేతుల్లోనే హాజరు, కూలీల డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధి హామీ పథకంలో అక్రమాలు ఊపందుకున్నాయి. ఎన్ని మార్గాలున్నాయో, అన్ని మార్గాల్లో ఉపాధి నిధులను తమ జేబుల్లోకి వేసుకునేందుకు పచ్చ నేతలు పక్కా ప్రణాళికలు రచించుకున్నారు. మస్టర్లలో దొంగపేర్లు రాసి సొమ్మంతా సొంత ఖాతాల్లో వేసుకునేందుకు టీడీపీ నాయకులు రంగం సిద్ధం చేశారు. కొత్తగా ఏర్పాటు కాబోతున్న శ్రమశక్తి సంఘాల ముసుగులో పక్కా దోపిడీకి స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ప్రతి 25 నుంచి 50 మంది కూలీలకు ఓ శ్రమశక్తి సంఘం ఏర్పాటు చొప్పున ఈ ప్రక్రియ జిల్లాలో దాదాపు పూర్తికావొస్తోంది. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 32 మండలాల్లో యాక్టివ్ జాబ్‌కార్డుల సంఖ్య 2.18 లక్షలు కాగా, వీటి పరిధిలో 3.62 లక్షల మంది ఉపాధి కూలీలు నమోదయ్యారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా దాదాపు 11,500 శ్రమశక్తి సంఘాలు కొత్తగా ఏర్పాటు కాబోతున్నాయి.

దోపిడీకే మేట్లు

ఉపాధి నిధులను అందిన కాటికి దోచుకునేందుకు మేట్లు విధానాన్ని కూటమి సర్కారు అమల్లోకి తీసుకొచ్చిందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. మేట్లుగా ఎంపికైన వారు కూలీలను ఉపాధి పనులకు తీసుకెళ్లడం, వారి అవసరాల మేరకు ఆన్‌లైన్‌లో డిమాండ్ పెంచుకోవడం, హాజరు నమోదు, వేతనాలకు సిఫారసు తదితర పనులను పర్యవేక్షించాల్సి ఉంది. ఈ మొత్తం ప్రక్రియనే టీడీపీ నేతల అక్రమాలకు ఊతమైంది. మస్టర్లలో దొంగ పేర్లు చేర్చి, ఉపాధి కూలీల సొమ్ము కాజేసేలా పక్కా ప్రణాళికను రచించారు. ఆ మేరకు ముందుకు అడుగులు వేస్తున్నారు. మేట్‌గా ఉన్న వారికి వారి పరిధిలోని ఒక్కొక్క కూలీపై రూ.1.50 చొప్పున చెల్లిస్తారు. ఈ లెక్కన జిల్లాలో యాక్టివ్‌గా ఉన్న 2.18 లక్షల మంది కూలీలకుగాను రోజుకు రూ.3.27 లక్షలు మేట్ల ఖాతాలకు చేరుతోంది. 100 రోజులకు రూ.3.27 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రకంగా కూలీల శ్రమదోపిడీకి కూటమి సర్కార్ తెరలేపింది.

జిల్లా సమాచారం

జిల్లాలో యాక్టివ్ జాబ్‌కార్డులు :	2.18 లక్షలు
నమోదైన కూలీల సంఖ్య :	3.62 లక్షలు
2024-25 లో పనిదినాల లక్ష్యం :	19,83,401
పూర్తయిన పనిదినాలు :	17,50,438
ఏర్పాటు కాబోతున్న శ్రమశక్తి సంఘాలు సుమారు :	11,500



జిల్లా కేంద్రంలోని డ్వామా కార్యాలయం



పచ్చనేతలు సూచించిన వారికే పెద్దపీట

ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి శ్రమశక్తి సంఘానికి ఓ మేట్‌ను నియమించారు. అయితే స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లకు తలొగ్గిన డ్వామా అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధి కూలీల్లో సీనియారిటీకి తిలోదకాలిచ్చి, పచ్చనేతలు సూచించిన వారికే పెద్దపీట వేశారు. ఇలా జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ పచ్చనేతలు గుర్తించిన వారే క్షేత్ర సహాయకులు, మేట్లుగా చలామణి అవుతున్నారు. ఈ విధానంపై ఉపాధి కూలీల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పరోక్షంగా టీడీపీ నేతలకు దోచిపెట్టేందుకే మేట్ల వ్యవస్థను కూటమి సర్కార్ అమల్లోకి తెచ్చిందని మండిపడుతున్నారు. మండుటెండలో శ్రమించే తమపై వీరి పెత్తనం ఏమిటని కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే విషయాన్ని బాహటంగా ప్రశ్నిస్తే వేతనాల్లో కోత వేస్తారమోననే భయం కూడా కూలీలను వెంటాడుతోంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో స్వర్ణయుగం

వైఎస్సార్ సీపీ హయాంలో ఉపాధి కూలీల సంక్షేమానికి గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రికార్డు స్థాయిలో పనులు కల్పించారు. ఎన్ఐసీ సర్వర్‌తో ప్రతి పనినీ పర్యవేక్షిస్తూ పైసా అవినీతికి తావు లేకుండా చర్యలు చేపట్టారు. శ్రమశక్తి సంఘాలతో కూలీల శ్రమదోపిడీని గుర్తించి వాటిని రద్దు చేశారు. ప్రతి పైసాను కష్టపడిన కూలీల ఖాతాకు చేర్చారు. ఫలితంగా అప్పటికే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సైతం స్వగ్రామాలకు చేరుకుని ఉపాధి పనులతో ఎంతో సంతోషంగా జీవించారు. గత ఐదేళ్లపాటు ఎలాంటి కష్టాలు లేకుండా జీవించిన ఉపాధి కూలీలకు ప్రస్తుత కూటమి పాలనలో కష్టాలు తప్పడం లేదు.

దోచుకునేందుకే..



కొత్త కొత్తగా వింత నిర్ణయాలు కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్నాయి. ఈ నిర్ణయాలన్నీ మార్పుల కోసం కాదు.. దోచుకునేందుకే. పూటగడవని ఉపాధి కూలీలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు. ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. మేట్లు విధానం రూపంలో ఉపాధి నిధులను పక్కదారి పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి కుట్రలను సహించేది లేదు. ఉపాధి కూలీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మేము డిమాండ్ చేస్తుంటే అవి కల్పించకుండా దోపిడీకి స్కెచ్ వేయడం అన్యాయం.

– వాడ గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, చిత్తూరు జిల్లా

కేజీబీవీ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ) పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని సమగ్రశిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 8 కేజీబీవీల్లో 2025-26 విద్యాసంవత్సరంలో 6, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతాయన్నారు. ఇందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్ జారీచేశారన్నారు. అలాగే 7,8,9,10, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగిలిన సీట్లను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అర్హత, ఆసక్తి కలిగిన బాలికలు ఈ నెల 22 వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వ తేదీ వరకు www.apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికయ్యే విద్యార్థులకు ఫోన్ నంబర్‌కు మెసేజ్ అందుతుందని తెలిపారు. జిల్లాలోని అనాథలు, బడిబయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలకు చెందిన బాలికలు అడ్మిషన్లు పొందేందుకు అర్హులన్నారు. జిల్లాలోని బైరెడ్డిపల్లి, గంగవరం, గుడుపల్లి, కుప్పం, పుంగనూరు, రామకుప్పం, రొంపిచెర్ల, శాంతిపురం మండలాల్లో ఉన్న కేజీబీవీల్లో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను అందుబాటులో పెట్టినట్లు చెప్పారు. ఇతర వివరాలకు 7075159996, 7075039990 నెంబర్లలో సంప్రదించాలని ఏపీసీ కోరారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

చిత్తూరు అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం చిత్తూరులోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న చీఫ్, డిపార్టుమెంటు అధికారులతో చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు పోలీసుశాఖ చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.



చిత్తూరులోని పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

ఏకపక్ష ‘బదిలీల’లు

ఉద్యోగుల బదిలీలంటే కొన్ని నిబంధనలు.. నియమాలు ఉంటాయి. తొలుత సీనియారిటీ గుర్తించాలి. బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించాలి. ఆపై ఉద్యోగులకు కొంత వెసులుబాటు ఇవ్వాలి. వీటన్నింటికీ తిలోదకాలిచ్చారు.. ఎవరో బురదచల్లారు.. దాన్ని కడిగేయాలి.. అన్న చందంగా చిత్తూరు పోలీసు శాఖలో ఏకపక్షంగా బదిలీలు సాగించారు ఉన్నతాధికారులు. దీనిపై పెదవి విరుస్తున్నారు చిరుద్యోగులు.

- పోలీసుశాఖను కుదిపేస్తున్న ట్రాన్స్‌ఫర్లు
- ఏ ఇద్దరు పోలీసులెదురైనా డీఓలపైనే చర్చ
- పరీక్షలయ్యేంత వరకు సమయం కోరుతున్న వైనం
- ఉన్నచోటిని కాపాడుకునేందుకు యూనియన్ మౌనం
- వాస్తవాలను బహిర్గతం చేయలేకపోతున్న అధికారులు



చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసు శాఖలో జరిగిన బదిలీల (డీఓలు) ప్రక్రియ.. ఆ శాఖను కుదిపేస్తోంది. మూడు రోజులుగా ఏకంగా 264 మంది సిబ్బందిని బదిలీ చేయడం.. అందులోనూ పుంగనూరు నియోజకవర్గంలోని సిబ్బందికి పూర్తిగా అక్కడి నుంచి స్థానచలనం కల్పించడంతో ఏ ఇద్దరు పోలీసులు తారాసపడినా.. బదిలీలపైనే చర్చిస్తున్నారు. కేవలం కూటమి ప్రజాప్రతినిధి పోలీసుశాఖపై రుద్దిన బురదను కడిగే ప్రయత్నంలో వందలాదిమంది సిబ్బందిని ఏకపక్షంగా బదిలీ చేయడంపై సిబ్బంది పెదవి విరుస్తున్నారు. సాధారణంగా సిబ్బంది బదిలీలు వేసవి సెలవులు పూర్తికావచ్చే సమయంలో నిర్వహిస్తారు. అప్పుడే పిల్లల్ని స్కూళ్లను మార్చడం, ఇళ్లు మార్చుకోవడం సాధ్యమవుతుంది. పైగా తప్పనిసరిగా బదిలీలకు ఓ కటాఫ్ కాలాన్ని.. అంటే ఐదేళ్ల పాటు ఒకే స్టేషన్‌లో పనిచేసేవాళ్లను తప్పనిసరి బదిలీలోకి తీసుకురావడం, నాలుగేళ్లు, మూడేళ్ల కాలపరిమితి పనిచేస్తున్న వారిని కలిపి కౌన్సెలింగ్ నిర్వహించేవాళ్లు. ఏయే స్టేషన్‌లో ఖాళీలున్నాయో చూపి.. పారదర్శకంగా బదిలీల ప్రక్రియ జరిగేది. కానీ ఈ దఫా జరిగిన బదిలీల్లో ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా.. కేవలం పోలీసుశాఖపై అధికారపార్టీ నేతలు చేసిన వ్యాఖ్యల ఆధారంగా సిబ్బందికి స్థానచలనం కల్పించారు. విద్యా సంవత్సరం ముగియడానికి మరో నెల గడువున్న నేపథ్యంలో ఉన్నట్టుండి జరిగిన బదిలీలపై పోలీసు కుటుంబాల పరిస్థితిని పెనంపై నుంచి పొయ్యిలోకి పడినట్లు అయ్యింది. సిబ్బంది స్థానచలనాల విషయంలో పైకి పుంగనూరు హత్య కనిపిస్తున్నా.. ఈపాపం మాత్రం కూటమి నేతలు మూటగట్టుకోక తప్పదనేది సుస్పష్టం. ఇంతటితో బదిలీల ప్రక్రియ ముగిసిపోలేదని.. ఇది తేనెతుట్టెను కదిపినట్లేనని తెలుస్తోంది. త్వరలో మరికొన్ని బదిలీలు జరగనున్నట్లు సమాచారం. పోలీసు సంక్షేమ కోసం ఏర్పాటైన పోలీసు యూనియన్ నాయకులు కూడా తమ గోడును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడంపై జిల్లాలోని పోలీసులంతా ముక్త కంఠంతో యూనియన్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. వాస్తవానికి ఇతర ప్రభుత్వ శాఖల్లోని సిబ్బందిలాగా ఉద్యోగులకు అన్యాయం జరిగినా, ఇబ్బందులు వచ్చినా ధర్నాలు, నిరసనలు చేసే ప్రక్రియ పోలీసుశాఖలో కుదరదు. సాటి పోలీసుల బాధలను అధికారుల దృష్టికి తీసుకెళ్లలేని తరుణంలో యూనియన్ నాయకులు ఆ పోస్టులకు రాజీనామా చేయడం ఉత్తమమని సిబ్బంది బహిరంగంగానే దుమ్మెత్తిపోస్తున్నారు.

కర్షక కష్టం.. వ్యాపారికి నైవేద్యం

అసలే వేసవి కాలం.. దిగుబడి అంతంత మాత్రం.. అదీ మార్కెట్‌కు తెచ్చేందుకు ఎనలేని కష్టం.. దక్కని సరైన ఫలితం.. పోనీ వినియోగదారుడికైనా చౌకధరలంటే అదీ లేని వైనం.. ఎందుకీ దుస్థితి అంటే రైతు సొంతంగా విక్రయించుకోలేని బలహీనత ఆసరాగా మండీ వ్యాపారి, దళారీ ఇష్టారాజ్యం.. అదే సరుకు తిరిగి కొనాలన్నా రెట్టింపు వ్యయం.. వెరసి.. పుడమి పుత్రుడికి మిగులుతోంది నష్టం.. వ్యాపారి, దళారీకి కురుస్తున్న కాసుల వర్షం.. ఇదీ జిల్లాలోని రైతులు దుస్థితి.

- గంటల వ్యవధిలోనే మారిపోతున్న కూరగాయల ధరలు
- దళారులు, మండీవ్యాపారులు, రీటైల్ వ్యాపారులు మేలు
- ఆరుగాలం కష్టించి పండించిన రైతులకు దక్కని గిట్టుబాటు
- ఇదీ జిల్లాలోని కూరగాయల కర్షకుల పరిస్థితి

పలమనేరు: పలమనేరులో టమాట సాగు చేసిన రైతులు ఇక్కడి మార్కెట్‌కు వెళ్లి టమాట కిలో రూ.10 లెక్కన విక్రయిస్తున్నారు. అదే టమాట మార్కెట్ బయట రిటైల్‌గా బండిపై వ్యాపారి కిలో రూ.20కి అమ్ముతున్నాడు. కేవలం గంటల వ్యవధిలోనే రైతుకు వ్యాపారికి మధ్య కిలోకు రూ.10 వ్యత్యాసం వస్తోంది. ఇదంతా చూస్తుంటే ఆరుగాలం కష్టపడి పంటసాగు చేసి రైతు కంటే గంటల్లో సరుకును కొన్న దళారులు, మండీ వ్యాపారులు బాగుపడుతున్నారేగానీ రైతుకు మిగిలిందేమీ లేదన్నట్టుగా మారింది. జిల్లాలో కూరగాయల సాగు చేసే రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివిలా మారింది.



పలమనేరులో చిరు కూరగాయల వ్యాపారాలు

భారీగా పంట పెట్టుబడులు

జిల్లాలోనే కూరగాయల సాగులో పలమనేరు హార్టికల్చర్ డివిజన్ ముందంజలో ఉంది. ఇక్కడ ఏటా పలు రకాల కూరగాయల సాగు 50 వేల హెక్టార్లుగా ఉంటుంది. సుమారు 30 వేల మంది రైతులు ఈ పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా టమాట పంటను ఎకరా సాగు చేయాలంటే పంట పెట్టుబడిగా రూ.2 లక్షలు, బంగాళాదుంపకు రూ.2 లక్షలు, బీన్స్‌కు రూ.లక్ష, ఇతర పంటలకు ఎకరానికి రూ.50 వేలుగా సగటున పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది.

అమ్మాలంటే తక్కువ.. కొనాలంటే ఎక్కువ

జిల్లాలో రైతులు అమ్మే ధరలకు, బహిరంగ మార్కెట్‌లో పలుకుతున్న ధరలకు భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. దీనికి కారణమేమిటంటే రైతు పండించిన ధరను మార్కెట్‌కు తీసుకెళితే అక్కడ పదిశాతం కమీషన్ పెట్టుకుని మండీ వ్యాపారులు కొంటారు. దానిపై లాభం పెట్టుకుని హోల్‌సేల్ వ్యాపారికి అమ్ముతారు. వారి వద్ద నుంచి అధిక ధరకు కొనే రీటైల్ వ్యాపారులు వారి లాభం పెట్టుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. కిలో రూ.10కి టమాట అమ్మిన రైతు అదే టమాటను ఇంటికి కొనాలంటే రూ.20 ఇచ్చి కొనాల్సిందే.



కూరగాయలు తరలిస్తున్న వాహనం

ఇదీ రైతులు, వ్యాపారులకున్న ధరల్లో తేడా...

కూరగాయ పేరు	రైతుకు దక్కే ధర	రీటైల్‌గా ధర	వ్యత్యాసం (రూపాయిల్లో)
టమాట	10	20	10
బంగాళాదుంప	12	22	10
క్యాబేజీ	02	12	10
బెండ	18	28	10
కాకర	20	40	20
దోస	15	25	10
బీన్స్	20	40	20
చిక్కుడు	25	40	15
వంగ	20	40	20
పచ్చిమిరప	15	40	25
ముల్లంగి	03	15	12
కొత్తిమీర కట్ట	05	10	05
కందులు	40	60	20
అలసంద	45	80	35
మునగ	30	60	30
బీర	15	60	45
మొక్కజొన్న	10	20	10

పంట వ్యాపారుల పాలు



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మాత్రం గిట్టుబాటు ధర లభించడంలేదు. మేము మార్కెట్‌లో అమ్మిన కూరగాయలనే మళ్లీ మార్కెట్‌లో కొనాలంటే రెట్టింపు ధర పెట్టి కొనాలి. దీనిపై ప్రభుత్వం గానీ, మార్కెటింగ్ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ఇలా అయితే రైతులు అప్పులపాలు కావాల్సిందే. గంటల వ్యవధిలో మా సరుకును కొన్న మండీవ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులు లాభాలు గడిస్తున్నా, కష్టపడిన రైతులకు మాత్రం నష్టాలు తప్పడం లేదే.

– అమరనాథ్ రెడ్డి, రైతు, చిన్నపరెడ్డిపల్లి, గంగవరం మండలం

గిట్టుబాటు ధరలు నిర్ణయించాలి



అన్ని రకాల ఉత్పత్తులకు గ్యారెంటీ ధరలుంటాయి. వాటిపై ఎంత ఎమ్మార్పీ ఉంటే అంతే ఇచ్చి జనం కొనుగోలు చేయాలి. అదే రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మాత్రం కనీస మద్దతు ధరలుండవు. రైతంటే అందరికీ అలుసుగా మారింది. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రైతులకు మేలు చేయాలనే తలంపు లేకుండా పోతోంది. ఫలితంగా రైతులు కష్టాల్లో పుట్టి, కష్టాల్లో పెరిగి, కష్టాల్లోనే చస్తున్నారు.

– ఉమాపతి నాయుడు, రైతుసంఘ నాయకులు, పలమనేరు

పది పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరా ధ్వంసం

-పోలీసులకు ఫిర్యాదు



రొంపిచెర్ల పరీక్ష కేంద్రంలో దుండగులు విరిచివేసిన కిటికీ తలుపులు

రొంపిచెర్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఆ స్కూలు ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్ఎం కథనం మేరకు.. రొంపిచెర్ల మండలంలో ఏటా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతుందని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో రొంపిచెర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ జరగడం లేదని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు పోలీసులు, డీఈఓకు ఫిర్యాదు చేశారు. సీసీ ఘటన స్థలాన్ని బుధవారం ఎస్ఐ సుబ్బారెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు పరిశీలించారు.

క్లుప్తంగా

కాన్పులన్నీ విధిగా నమోదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అన్ని కాన్పులను విధిగా నమోదు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి ఒక ప్రకటనలో ఆదేశించారు. జిల్లాలోని ప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్‌హోమ్‌ల్లో జరిగే కాన్పుల సంఖ్యను విధిగా హెచ్‌ఎంఐఎస్, సీఆర్‌ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జనన లెక్కలో తప్పిదాలు ఉండకూడదన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన బాధ్యత ప్రైవేటు ఆస్పత్రులదేనన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

పార్కింగ్ ఫీజు వేలం రూ. 2.12 కోట్లు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కాణిపాకం: కాణిపాకంలో బుధవారం పార్కింగ్ ఫీజు వేలం నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి గాను కాణిపాకం గ్రామ పంచాయతీ, దేవస్థానం సంయుక్తంగా నిర్వహించిన ఈ వేలంలో రూ. 2.12కోట్ల వరకు పలికింది. కాణిపాకానికి చెందిన ఆర్.సెల్వం పార్కింగ్ ఫీజు హక్కును కైవసం చేసుకున్నారు. ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి కుసుమ కుమారి మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ఫీజు వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, వార్డు సభ్యులు, ఆలయ అధికారులు, వేలం పాటదారులు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు విద్యార్థికి గేట్ జాతీయ స్థాయి ర్యాంకు



విద్యార్థి వర్షిత్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు చెందిన విద్యార్థి వర్షిత్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్(గేట్) ఫలితాల్లో జాతీయ స్థాయిలో 13వ ర్యాంకు సాధించాడు. ఈ నెల 19వ తేదీన గేట్ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. జిల్లాలోని యాదమరి మండలం కే.గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న సుధాకర్, అదే మండలంలో దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న పద్మజ దంపతుల కుమారుడు వర్షిత్ గేట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 13 స్థాయి ర్యాంకు సాధించాడు.

25న ప్రసన్నుడి కల్యాణోత్సవం

తిరుపతి కల్చరల్ : అప్పలాయిగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 25వ తేదీన స్వామివారి కల్యాణమహోత్సవం నిర్వహించనున్నారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ.

ఇసుమంతైనా భయం లేదు!

అక్రమమా..సక్రమమా.. తరువాత సంగతి.. గాలి ఉన్నప్పుడే తూర్పార పట్టాలన్నట్టుంది ఇసుకాసురుల పరిస్థితి. ఇసుక పాలసీని అతిక్రమించి నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారు. తాగునీటి బోర్లను సైతం తవ్వేస్తున్నారు. అడ్డుకోవడానికి వెళ్లిన అధికారులపైనా దౌర్జన్యం చేసి, అక్కడికి రానీయకుండా వారినీ అడ్డుకుంటున్నారు. ఇదీ కౌండిన్యలో సాగుతున్న ఇసుక దందా.

- అధికారులనే అడ్డుకున్న ఇసుక స్మగర్లు
- కౌండిన్యలో ఆగని అక్రమరవాణా
- మున్సిపల్ పంప్‌హౌస్ వద్ద భారీగా తవ్వకాలు
- అడ్డుకున్న అధికారులపై దౌర్జన్యం



మున్సిపల్ కమిషనర్, డీఈలను బెదిరిస్తున్న ఇసుక స్మగర్లు

పలమనేరు: కౌండిన్య నదిలో నిత్యం జేసీబీలు, ట్రాక్టర్లను పెట్టి కావాల్సినంత తోడేస్తున్నారు. చివరకు మున్సిపల్ పంప్‌హౌస్ వద్ద బోర్లను సైతం ఇసుకాసురులు తోడేస్తుంటే చేసేదిలేక స్థానిక మున్సిపల్ అధికారులు బుధవారం అక్కడికి వెళ్లారు. నదిలో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను ఆపేందుకు మున్సిపల్ కమిషనర్, డీఈలు ప్రయత్నించగా వారిపైనే ఇసుకాసురులు దౌర్జన్యానికి దిగారు. దీంతో వారు పోలీసులకు ఫోన్ చేసి కొన్ని ట్రాక్టర్లను మాత్రం సీజ్ చేయించారు. అక్కడున్న జేసీబీలను డ్రైవర్లు అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు.

పంప్‌హౌస్ వద్ద బోర్లు నాశనం

పలమనేరు పట్టణానికి కౌండిన్య నదిలోని పంప్‌హౌస్ నుంచి మంచినీటి సరఫరా సాగుతోంది. అక్కడ మున్సిపల్ అధికారులు ఏడు బోర్లను డ్రిల్ చేశారు. వీటిల్లో ఇటీవల ఇసుకను తోడేయడంతో రెండుబోర్లలో నీరు రావడంలేదు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బందితో కలసి అక్కడికెళ్లి పరిశీలించారు. ఆయన ముందే పదులసంఖ్యలో ట్రాక్టర్లు, జేసీబీలను చూసి అక్కడికెళ్లి ఇసుక తోడకూడదంటూ అడ్డుకున్నారు. దీనిపై ఇసుకాసురులు సైతం తగ్గేదేలేదంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయన పోలీసులను పిలిపించేలోపు అక్కడున్న ట్రాక్టర్లు జేసీబీలు వెళ్లిపోగా రెండు ట్రాక్టర్లను మాత్రం పోలీసులు తూతూ మంత్రంగా సీజ్ చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన గంగవరం, పలమనేరు తహసీల్దార్లకు తెలుపుతామని పేర్కొన్నారు.



క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్యలో ఇసుక అక్రమ రవాణా



ఇసుక తవ్వకాలతో ఎండిన బోరును చూస్తున్న అధికారులు

పగటి డంప్‌లకు.. రాత్రి కర్ణాటకకు..

గతంలో ఇక్కడి నుంచి ఇసుకను అక్రమంగా కర్ణాటకలోని హొసకోటకు తరలించేవారు. ఇప్పుడలా కాదు కర్ణాటక నుంచే టిప్పర్లు డంపుల వద్దకే వస్తున్నాయి. ఓ ట్రాక్టర్ ఇసుకను చెప్పిన చోటుకు తెచ్చి దింపితే రూ.2 వేలుగా నిర్ణయించారు. ఓ టెన్‌వీలర్ టిప్పర్‌కు 6 ట్రాక్టర్ లోడ్లు. అంటే డంపు వద్దకు చేరితే టిప్పర్ విలువ రూ.12 వేలు. తోడిన ఇసుకను రహస్యప్రదేశాల్లో డంప్‌ల్లో దింపుకుంటున్నారు. ఆపై రాత్రుల్లో కర్ణాటక నుంచి టిప్పర్లు రాగానే ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడి వ్యాపారులు స్పాట్‌లోనే టిప్పర్‌కు రూ.24 వేలు చెల్లిస్తున్నారు. అంటే టిప్పర్ ఇసుకను అమ్మితే రూ.12 వేల గిట్టుబాటు.

ఎలాంటి ఇబ్బందులు లేకుండా...

నదిలో ఇసుకను తోడుతున్నవారిని అడిగితే ఇంటి నిర్మాణానికని చెబుతున్నారు. ఇంకొందరు ట్రాక్టర్లకు పచ్చ పెయింట్, డ్రైవర్‌కు పచ్చ కండువా, జేబులో చంద్రబాబు ఫొటో పెట్టుకుని అధికారులనే బెదిరిస్తున్నారు. నియోజకవర్గంలోని కొంగోళ్లపల్లి, ముసలిమొడుగు, కూర్మాయి, మొరం, ముదరంపల్లి, బైరెడ్డిపల్లి, గుండుగల్లు, చిన్నూరు తదితర గ్రామాల్లో ఇసుక రవాణా చేసేవారే పదులసంఖ్యలో ఉన్నారు. ఈ గ్రామాల్లో పది నుంచి ఇరవై ట్రాక్టర్లు, గ్రామానికి రెండు, మూడు జేసీబీలున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

బహుదానది.. ఆగని ఇసుక దందా

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నేతల కనుసన్నల్లోనే అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రేయింబవళ్లు యంత్రాలతో తవ్వి సుమారు 15 టిప్పర్ల ద్వారా ఇసుకను హైవే మీదుగానే సరిహద్దులు దాటిస్తున్నారు. ఐరాల మండలంలోని బహుదా నదిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది. మైనగుండ్లపల్లె సమీపంలోని బహుదానదిలో నడిబొడ్డున(మధ్యలో) హిటాచ్ యంత్రాలతో సుమారు 20 అడుగుల లోతు మేరకు నీటిలో నుంచి ఇసుకను తవ్వి టిప్పర్లకు లోడ్ చేసి, హైవే మీదుగానే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

అందుగంటుతున్న భూగర్భ జలాలు

వర్షాకాలంలో బహుదానది ఒక సంవత్సరం ప్రవహిస్తే మూడేళ్ల పాటు పరిసర గ్రామాల్లో వ్యవసాయ బోర్లు, తాగునీటి బోర్లలో భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయి. దీంతో రైతులు పంట సాగు చేసుకోవడానికి నీటి కొరత ఉండదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బహునదిలో 20 అడుగుల లోతు వరకు ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిద్రావస్థలో అధికార యంత్రాంగం

బహుదానదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం శోచనీయం. రేయింబవళ్లు యథేచ్ఛగా టిప్పర్లతో తరలిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికార యంత్రాంగం నిద్రావ్యవస్థలో జోగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారుల మొద్దు నిద్ర వీడి బహుదా నదిలో అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నీవానదిలో..

గంగాధరనెల్లూరు: నియోజకవర్గ కేంద్రానికి సమీపంలోని నీవానదిలో ఇసుక దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ఇసుక అక్రమ రవాణాతో కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారు.



ఇసుక లోడ్ కోసం వేచి ఉన్న టిప్పర్లు



మైనగుండ్లపల్లె సమీపంలోని బహుదానదిలో ఇసుక తవ్వకాలు

చిత్తూరు మార్గంలోని నీవానదిపై ఉన్న బ్రిడ్జికి నూరు మీటర్ల దూరంలో నుంచి టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. మండల కేంద్రానికి కూతవేటులో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

సచివాలయ ఉద్యోగులకు సీపీటీ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు కామన్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(సీపీటీ)ను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆ నోటిఫికేషన్‌ను అనుసరించి ఆ పరీక్షకు అర్హత ఉన్న సచివాలయ ఉద్యోగులు దరఖాస్తులు చేసుకోనున్నారు. ఏప్రిల్ 12,13 తేదీల్లో తిరుపతి జిల్లాలో పరీక్షను నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీ గ్రేడ్ 5, వీఆర్వో గ్రేడ్ 2, గ్రేడ్ 1 ఉద్యోగులు హాజరుకానున్నారు. ఈ పరీక్షలో పొందే ఫలితాల ఆధారంగా ఆ ఉద్యోగులను జిల్లా, డైరెక్టరేట్ శాఖలతో పాటు ఏపీ సెక్రెటేరియట్‌లో నియమిస్తారు.

హత్యకేసులో నిందితురాలు లొంగుబాటు

పుంగనూరు: మండలంలోని కృష్ణాపురంలో రామకృష్ణ హత్యకేసులో నిందితురాలైన రజిని బుధవారం న్యాయవాది శివప్పనాయుడు ద్వారా కోర్టులో లొంగిపోయింది. రికార్డులు పరిశీలించిన అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి వంశీకృష్ణ ఆమెను జ్యుడిషియల్ కస్టడీకి పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ హత్య కేసులో నిందితులైన త్రిలోక, మహేష్‌ను అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ విలేకరులకు తెలిపారు. వీరిని కోర్టుకు పంపి, రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ముగ్గురు నిందితులను మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

టీటీడీ ఉద్యోగిపై చీటింగ్ కేసు

తిరుమల : చెన్నై శ్రీవారి ఆలయంలోని పరకామణిలో విదేశీ కరెన్సీ నోట్లను తారుమారుచేసిన టీటీడీ ఉద్యోగి కృష్ణకుమార్‌పై తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ చలపతి కథనం మేరకు.. ప్రస్తుతం తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన కృష్ణమోహన్ గత ఏడాది చెన్నై శ్రీవారి ఆలయంలో విధులు నిర్వర్తించే సమయంలో విదేశీ కరెన్సీని పక్కదోవ పట్టించారు. ఈ మేరకు అవకతవకలను అధికారులు గుర్తించారు. దాదాపు రూ.7లక్షల వరకు కాజేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు పాల్పడినట్లు విజిలెన్స్ నివేదికలో వెల్లడించారు.నీ మేరకు నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

హిందీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్?

- స్థానిక ఉపాధ్యాయులు, ఇన్విజిలేటర్లపై ఆరోపణలు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి



చౌడేపల్లె పదోతరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో బుధవారం నిర్వహించిన పదో తరగతి హింది పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగిందన్న ఆరోపణలు వెలువెత్తాయి. ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలున్నాయి. వీటిలో మొత్తం 500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీటి నిర్వహణకు మొత్తం మండలంలో పనిచేస్తున్న 26 మంది ఎస్‌జీటీలను ఇన్విజిలేటర్లుగా నియమించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉన్న టీచర్లకు సుపరిచితులైన ఇన్విజిలేటర్లు ఉండడంతో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోందని పలువురు విమర్శించారు. అలాగే స్థానిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, పరీక్ష కేంద్రం వద్ద తిష్ట వేసి, ఇన్విజిలేటర్లపై ఒత్తిడి తెస్తూ మాస్ కాపీయింగ్‌కు సహకారమిస్తున్నారని పలువురు విమర్శించారు. స్థానికంగా ఉండే ఉపాధ్యాయులకు స్థానికంగా ఉన్న ఇన్విజిలేటర్లను నియమించడంతోనే మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోందని పలువురు విమర్శించారు. రాబోయే ఇంగ్లిషు పరీక్షలో మరింత జోరుగా సాగే అవకాశం ఉందని సమాచారం. ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రంపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమైన పరీక్ష కేంద్రం చీఫ్ వేణును వివరణ కోరగా అలాంటిదేమీ జరగలేదని, మూడుసార్లు స్క్వాడ్ తనిఖీ చేసిందని, పటిష్టంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు బదులిచ్చారు.

ఏనుగుల దాడులను అరికట్టాలి



బంగారుపాళెం: బోడబండ్లలో ఏనుగుల దాడిలో దెబ్బతిన్న రైతుల పంటలను పరిశీలిస్తున్న నాయకులు

బంగారుపాళెం: అటవీశాఖ అధికారులు ఏనుగుల దాడులను అరికట్టి రైతుల పంటను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బోడబండ్లలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన బాధిత రైతులు సురేష్, కృష్ణయ్య, సంజీవి, భాస్కర, గోవిందు, ఈశ్వర్, శీను, లలిత, కృష్ణయ్య, మునేంద్ర, వెంకటప్ప, చంద్రయ్య, నాగభూషణం, సుధాకర్, సుబ్రమణ్యం, రామకృష్ణ, రాజేంద్ర, రవి, లోకనాథం మందడి పొలాలను సీపీఐ నాయకులు పరిశీలించారు. అనంతరం బాధిత రైతులతో కలసి స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు మణి, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు కుమారి, రఘు రైతులు పాల్గొన్నారు.



బంగారుపాళెం:బోడబండ్ల కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు, బాధితులు

అడిగేదెవరు?.. ఆపేదెవరు?

అధికారం మాది.. మేము చెప్పిందే వేదం.. మమ్మల్ని అడిగేవారు లేరు.. ఆపేవారు లేరు అంటూ పెనుమూరులో పచ్చనేతలు రెచ్చిపోతున్నారు. ఇప్పటికే పలు దందాలు చేస్తున్నారు. నేడు బస్టాండు వేలంలోనూ తమ ప్రతాపం చూపుతున్నారు. వేలం పాటలో పాల్గొనాలంటే టీడీపీ నేతలై ఉండాలని హుకుం జారీ చేశారు. ఈ సంఘటన బుధవారం గంగాధరనెల్లూరు మండలం, పెనుమూరు బస్టాండు వేలంపాటలో చోటుచేసుకుంది.

- అధికారబలంతో రెచ్చిపోతున్న కూటమి నేతలు
- టీడీపీ ఏజెంట్లుగా మారుతున్న అధికారులు
- బస్టాండ్ వేలంపాటలో ఎవరూ పాల్గొనవద్దని హుకుం



గుమిగూడి ఉన్న తిరుపతి నుంచి వచ్చిన గూండాలు



ధ్వంసమైన హైకోర్టు న్యాయవాది జగదీష్ కారు

పెనుమూరు(కార్వేటినగరం) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెనుమూరులో రెడ్‌బుక్ పాలన రాజ్యమేలుతుంది. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వం భూములను కబ్జా చేసుకున్నారు. ఈ సంఘటన మరవక ముందే బస్టాండ్ వేలంలోనూ వారి ప్రతాపం చూపుతున్నారు. వేలం పాటకు వచ్చేవారిని బెదిరించి భయాందోళనకు గురి చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు సైతం టీడీపీ ఏజెంట్లుగా మారి, పచ్చనేతలు తప్ప ఎవరు వేలం పాటలో పాల్గొనకూడదని హుకుం జారీ చేసినట్లు తెలిసింది.

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

పెనుమూరు ఆదాయం పెంపునకు గత ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎంగా పనిచేసిన నారాయణస్వామి సుమారు రూ.1.08 కోట్ల వ్యయంతో బస్టాండ్‌లో సుమారు 24 దుకాణాలు కలిగిన కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేశారు. అది పూర్తి అయినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆ కాంప్లెక్స్‌లో దుకాణాలను అద్దెకు ఇవ్వడానికి వేలం పాటలకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో టీడీపీ నేతలు తామే వేలం పాటల్లో పాల్గొనాలని, ఇతరులు పాల్గొనకూడదని హుకుం జారీ చేశారు. అధికారులు కూడా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని వేలం పాటలో ఎవరినీ పాల్గొననీయకుండా అడ్డుకుంటుందని స్థానికులు విమర్శిస్తున్నారు. అంతే కాకుండా వేలం పాటలో పాల్గొనడానికి బ్యాంకుల్లో డీడీలు చెల్లించిన 300 మందిని టీడీపీ నాయకులు, అధికారులతో పాటు బెదిరించి, తిరుపతి నుంచి రప్పించిన 50 మంది గూండాలతో భయందోళనకు గురి చేశారు. అయినప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించి ఏ మాత్రం పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా వేల పాటలు నిర్వహించి, అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టారని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. ఒక్కొక్క గదికి నెలకు సుమారు రూ.10 నుంచి రూ.15 వేల వరకు అద్దెరావాల్సి ఉండగా పచ్చనేతలు అతి తక్కువ ధరకే తమ అనుచరులకు అప్పగించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భగ్గుమన్న వర్గ విభేదాలు

వేలం పాటలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే వర్గం వర్సస్ టీడీపీ మండల అధ్యక్షుడి రుద్రయ్య వర్గం బాహాబాహీలకు దిగాయి. తమ వర్గం వారికి గదులు లేకుండా చేయడంతో రెచ్చిపోయిన ఇరువర్గాలు గొడవ పడ్డాయి. ఈ క్రమంలో హైకోర్టు న్యాయవాది, టీడీపీ రాష్ట్ర నాయకుడు గద్వాల జగదీష్ నిలదీయడంతో ఆయనపై కర్రలతో, రాళ్లతో దాడికి దిగారు. అలాగే ఆయన కారును పెనుమూరు బస్టాండ్‌లో ధ్వంసం చేశారు. దీంతో పెనుమూరు మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.బీ సుధాకర్‌రెడ్డి ఈ వ్యవహారాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని చెప్పడంతో రచ్చ సద్దుమణిగింది.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి

ఐరాల: ప్రజల నుంచి అందిన రెవెన్యూ సమస్యల అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వీఆర్వోలను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో, ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదికలు సిద్ధం చేయాలని తహసీల్దార్ మహేష్‌కుమార్‌ను ఆదేశించారు. ప్రజలు ఎక్కువగా రెవెన్యూ సమస్యల పరిష్కారం నిమిత్తం కార్యాలయానికి వస్తుంటారని, సమస్యల నిమిత్తం వచ్చే ప్రజలతో సిబ్బంది సానుకూలంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యాలయ ఆవరణలో మొక్కల పెంపకం చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.